
ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 12 | సంచిక : 3 | నవంబర్ 2006

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-09-06, ఆకివీడు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏ పని చేసినా ఈ లోకానికి సంబంధించిన పని చేసినా, నిర్వాణసుఖాన్ని పొందటానికి ప్రయత్నం చేసినా ఈశ్వరుని యొక్క దయలేకుండా మనం ఏదీ సాధించలేము, ఇది ముందు మనకు అర్థమవ్వాలి. ఈశ్వరుని యొక్క అనుగ్రహం లేకుండా ఇహంలో గాని, పరంలోగాని మనం ఏదీ సాధించలేము. అందుచేతనే ఏ పని చేస్తున్నా ముందు గణపతి పూజ చేస్తారు, గణపతి అంటే గణపతి రూపంలో ఉన్న ఈశ్వరుడు. మనందరకు లోకజ్వరం ఎక్కువగా ఉంది. ఆ జ్వరం తగ్గాలంటే సజ్జనసాంగత్యం చెయ్యాలి. సత్సంగం వలన ప్రాపంచికవిషయాలతోటి సంబంధం తగ్గిపోతుంది. మట్టిని కుండల కింద చేస్తారు. అలా చేసేటప్పుడు కుమ్మరివాడు ఆమట్టిలో ఉన్న రాళ్ళను, చెత్తను పూర్తిగా తీసేసి మట్టిని శుభ్రం చేస్తాడు. లేకపోతే కుండలు తయారయ్యాక బీటలు వచ్చేస్తాయి. మట్టిని శుభ్రం చెయ్యటానికి కుమ్మరివాడు ఎంత కష్టపడతాడో అలాగ మన మనస్సును శుద్ధిచెయ్యటానికి సజ్జనులు సహకరిస్తారు. అందుచేత సజ్జన సహవాసం కోసం అవసరమయితే భూమియొక్క అంచులదాక వెళ్ళమని ఐన్‌స్టీన్ చెప్పాడు. ఒక్క ఆత్మవిద్య తప్పించి మిగిలిన విద్యలు అన్నీ పొట్టకు సంబంధించిన విద్యలే, ఈ ప్రపంచం ఎంత నిజమో, ఈ శరీరం ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. నీ పొట్టపోషణకు సహకరిస్తాయి గాని ఆ విద్యలు ఏమీ నీకు మోక్షాన్ని ఇవ్వవు. మిగతా విద్యలు అన్నీ విద్యల కింద కనిపించే అవిద్యలు అని శాస్త్రంలో చెప్పారు. ఒక్క ఆత్మవిద్య మాత్రమే నీకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది, అదే నిజమైనవిద్య. సజ్జనసాంగత్యం వలన మనకు తెలియకుండా మనం

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥100/-

విడి ప్రతి : రూ॥ 5/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

ఆకివీడు ............. 02-09-06

గోడిపాలెం ........ 10-09-06

మాగం ............... 11-09-06

కైకలూరు ........... 10-10-06

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, ☎ 08814 - 228858

పవిత్రులమవుతాము, సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం ప్రాక్టీసు చెయ్యమని భగవద్గీతలో పరమాత్మ చెప్పాడు. ఎందుచేతనంటే సత్వగుణం కూడా గుణమే కాని అది మోక్షానికి దారి చూపించి ప్రక్కకు తప్పకొంటుంది. అందుచేత మనం సత్వగుణం అభివృద్ధి చేసుకోవాలి. వాలుగాలిలో సైకిలు తొక్కటం ఎలా ఉంటుందో మనం చేసే సాధనకు సత్వగుణం అలా సహకరిస్తుంది. అందుచేత సత్వగుణం చాలా ముఖ్యం.

మీరు నాయందు భక్తి కలిగి ఉంటే, నన్నే స్మరిస్తూ ఉంటే మీ యోగక్షేమములు చూసే బాధ్యత నాది అని పరమాత్మ చెప్పాడు. తల్లిదండ్రులను బాగాచూడాలి, పెద్దలను గౌరవించాలి అని చెపుతూ ఉంటారు, అది సామాన్య ధర్మం. అయితే ప్రహ్లాదుడు భగవంతుడి కోసం తండ్రిని విడిచిపెట్టాడు. అలాగే భగవంతుడి కోసం మనం సామాన్యధర్మాలను విడిచిపెట్టినా యిబ్బంది లేదు. దేవుడు లేడు, మోక్షం లేదు అని మీ ఇంటి దగ్గర చెపుతున్నారు అనుకోండి వారిని విడిచిపెట్టినా దోషం లేదు. మీరు ఆధ్యాత్మికమార్గంలో ప్రయాణం చేస్తున్నారు అనుకోండి మీ తల్లితండ్రులుగాని ఎవరైనా ఇతరులుగాని అడ్డువస్తున్నారు అనుకోండి మనం ప్రక్కకు తప్పకోవాలి, ప్రహ్లాదుడు అలాగే తప్పకొన్నాడు. నాయందు భక్తి కలిగి, నాకు శరణాగతి పొందితే గతజన్మలనుండి వచ్చిన దోషాలు నీ బుద్ధిలో ఎన్ని ఉన్నప్పటికీ ఆ దోషాల నుండి నిన్ను విడుదలచేసి, నిన్ను శుచిచేసి, మోక్షసామ్రాజ్యాన్ని నీకు ప్రసాదించే బాధ్యత నాది అంటున్నాడు పరమాత్మ. ఇంక దుఃఖపడవలసిన పని ఏముంది. నమ్మినవాడికి సొమ్ము, నమ్మనివాడికి దుమ్ము. కొంతమంది మన నమ్మకాలను చెడగొడుతూ ఉంటారు, వారికి దూరంగా ఉండాలి. భగవంతుడి మీద ఉన్న నమ్మకాన్ని చెడగొట్టేవారు ఎవరైనా ఆయన దగ్గరకు వస్తే వారు వెళ్ళిపోయిన తరువాత ఆ గదిని శుభ్రంగా కడిగించేవారు రామకృష్ణుడు. భగవంతుడియందు మనకు ఉన్న విశ్వాసాన్ని కాపాడుకొంటూ రావాలి. విశ్వాసం ఎప్పడూ సమానంగా ఉండేలా చూసుకోవాలి. మనకు విషయబుద్ధిపోయి, ఆత్మ బుద్ధి కలగాలంటే దానికి సజ్జనసాంగత్యం ఒక మందు అని చెప్పారు. నేచురల్‌గా చక్కటి గాలి వీస్తూ ఉంటే మనకు ఫాన్‌గాలితో పని ఏముంది, అలాగే నీకు సజ్జనసాంగత్యం దొరికితే నీ జపధ్యానములతో సంబంధం లేకుండా నువ్వు నిర్వాణసుఖాన్ని పొందుతావు, సజ్జన సాంగత్యం యొక్క గొప్పతనం అట్టిది. పరమపవిత్రుడు ఎప్పడూ కపటంగా ఉండడు. మాకు కపటం లేదు అని మీరు చెప్పవచ్చు కాని లోపల అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు కదా. తలంపు రాకముందే నీలో ఏమి ఉందో ఆయనకు తెలుస్తుంది. లౌకికులతో చాలా ప్రమాదం, వారి వలన భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని మనకు కలిసివచ్చేది ఏమీ లేదు, మన మార్గాన్ని చెడగొడతారు. ఎందుకలా చెడగొడుతున్నారు అంటే అది వారి స్వభావం. అందుచేత లౌకికులతో బహుజాగ్రత్తగా ఉండాలి.

ఆధ్యాత్మికమార్గాన్ని విడిచిపెట్టకుండా ఉండాలంటే ఎంతో నైతికబలం ఉండాలి, మనో యోగం ఉండాలి. మనోయోగం అంటే మనస్సులో పవిత్రమైన భావాలు వస్తూ ఉండాలి. పూజకంటే జపం గొప్పది, జపం కంటే ధ్యానం గొప్పది, ధ్యానంకంటే భావన మంచిది అని చెపుతారు. మీకు నేను ఉపకారం చేయలేకపోవచ్చు కాని మీరు బాగుపడాలి, మీకు మోక్షం కలగాలి అనే మంచిభావన కలిగిఉండటంలో దారిద్ర్యం అక్కరలేదు, భావదారిద్ర్యం పనికిరాదు. భావన కంటే ప్రేమ గొప్పది, ఆ ప్రేమ వలన ఈశ్వరుడు నీకు వశీకరణమవుతాడు. శ్రీకృష్ణ చైతన్యకు ఉన్నది అంతా ప్రేమ, ఆ ప్రేమ వలన వాసుదేవస్వామిలో ఐక్యమయ్యాడు, వాసుదేవ స్వామి ఆ ప్రేమకు కట్టుబడిపోయాడు. మనకు ధనం లేకపోవచ్చు కాని భావదారిద్ర్యం ఉండకూడదు, భావదారిద్ర్యం ఉన్నవాడికి జ్ఞానం వచ్చే ప్రసక్తే లేదు. ఈ జీవుడు, దేవుడు ఒక్కటే. ఈ రెండింటిలో భేదం చూస్తున్నంతకాలం నీకు పునర్జన్మలు వస్తాయి. ఈ రెండింటిలో భేదం లేదని గ్రహిస్తే అదే తత్వజ్ఞానం. అది నోటితో చెపితే సరిపోదు, అది అనుభవైకవేద్యం. మనం కర్మను యోగంగా చేయము, కర్మను భోగిస్తాము. ఒక చిన్న పని చేస్తే, దాని ఫలితం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తాము. కర్మభోగులు జననమరణ చక్రంలో నుండి బయటకు రాలేరు, వారు మనుషులుగా జన్మించవచ్చు, జంతువులుగా జన్మించవచ్చు, ఉత్తమజన్మలు రావచ్చు, నీచజన్మలు రావచ్చు, ఇతర లోకాలకు ప్రయాణం చేయవచ్చు, మొత్తం మీద వాడికి ప్రయాణాలు తప్పవు. జీవుడు ఏ హృదయంలో నుండి అయితే వస్తున్నాడో అక్కడకు వెళ్ళి అందులో అణిగేవరకూ వాడికి జన్మలు తప్పవు, ఇందులో రాజీ లేదు. నువ్వు భక్తిమార్గంలో ప్రయాణం చెయ్యి, జ్ఞానమార్గంలో ప్రయాణం చెయ్యి. నీకు చిత్తశుద్ధి లేనప్పుడు నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా లాభం లేదు. నీకు జీవితంలో సమన్వయం లేదు. నీ ఆలోచనకు, మాట్లాడేమాటకు, చేతితో చేసే పనికి సమన్వయం లేదు అంటే త్రికరణశుద్ధి లేదు. మీకు చిత్తశుద్ధి లేనప్పుడు, త్రికరణశుద్ధి లేనప్పుడు మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఫలితం సున్నా. మీరు 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నారు అనుకోండి, బలానికి టానిక్‌లు తాగేస్తున్నారు అనుకోండి ఏమిటి ప్రయోజనం, ముందు జ్వరం తగ్గాలి కదా. జ్వరం తగ్గిన తరువాత బలం టానిక్ వాడితే ఎంతో కొంత ప్రయోజనం ఉంటుంది.

కర్మను యోగంగా చేస్తే వాసన పడదు, కర్మను భోగించటం వలన వాసన పడుతుంది. సర్వసాధారణంగా జీవుడు కర్మఫలాన్ని త్యాగం చేయడు, వాడు అనుభవిస్తాడు, అనుభవించటమే భోగించటం. కర్మఫలత్యాగే నిజమైనసన్యాసి, వాడే జ్ఞాని. ఒక త్యాగికి మాత్రమే భగవంతుడు చెప్పిన మాటలు వాడి అవగాహనకు అందుతాయి, ఆ మాటలు వాడికి అనుభవంలోనికి వస్తాయి. త్యాగి కానివాడికి జ్ఞానం లేదు. మనస్సు ఎక్కువగా బాహ్యముఖానికి వెళుతూ ఉంటే రజోగుణం

ఎక్కువగా ఉన్నట్లు గుర్తు. సత్వగుణం వలన మనస్సుకు లోచూపు కలుగుతుంది, సత్వగుణం నీచేత మంచిపనులు చేయిస్తుంది, సత్వగుణం వలన మనలో ఉన్న పొరపాట్లు సవరించుకోగలము. రజోగుణం ఉన్నవాడు వాడిలోని పొరపాట్లు సవరించుకోడు సరికదా ఇతరులలోని పొరపాట్లు చూడటానికి రైలు దాటిపోతూ ఉంటే రైలు కోసం ఎంత వేగంగా పరిగెడతామో అంత వేగంగా పరిగెడతాడు. సత్వగుణం ఉంటే నీవు నిదానంగా ఆలోచించగలవు, నీవు మాట్లాడేమాట, చేసేపని నిర్మలంగా ఉంటుంది, నువ్వు చేసేపని ఇతరులకు తెలియాలి అని కూడా నీవు అనుకోవు. ఇతరులకు తెలియాలి అని నీకు ఎప్పుడైతే సంకల్పం వచ్చిందో అది రజోగుణ లక్షణం. ఇతరుల కళ్ళతో మిమ్మల్ని మీరు ఎప్పుడూ చూసుకోవద్దు, మీ కళ్ళతో చూసుకోండి. మీ కళ్ళతో మిమ్మల్ని మీరు చూసుకొంటూ ఉంటే మీకు సత్వగుణం పెరుగుతుంది. చెట్టు మీద పక్షులు ఉన్నాయి అనుకోండి. ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి తప్పట్లు కొడితే పక్షులు ఎగిరిపోతాయి. నువ్వు నిరంతరం భగవంతుడిని స్మరిస్తున్నావు అనుకో, చెట్టు దగ్గర తప్పట్లు కొడితే పక్షులు ఎలా ఎగిరిపోతాయో, అలాగ నామస్మరణ వలన నీ బుద్ధిలో ఉన్న దోషాలు కూడా ఎగిరిపోతాయి. భగవంతుడిని నిరంతరం స్మరిస్తూ ఉంటే బుద్ధిలో దోషాలు ఉంటాయా? జలం ఏవిధంగా అయితే శరీరాన్ని శుభ్రం చేస్తుందో అలాగ నామస్మరణ నీ బుద్ధిని శుద్ధి చేస్తుంది. హరిని స్మరిస్తూ ఉంటే, శివస్మరణ చేస్తూ ఉంటే ఇంక దోషాలు ఏమిటి? గడ్డిపరకలు అన్నీ కలిసి తాడు కింద ఎలా తయారవుతాయో వాసనలు అన్నీ కలిసి మనస్సు కింద తయారవుతాయి. గడ్డితాడులోని గడ్డిపరకలను ఒకోదానిని తీసివేస్తే ఇంక తాడు లేదు. అలాగే మనస్సులో ఉన్న వాసనలను ఒకో వాసనను తీసివేస్తే ఇంక మనస్సు మిగలదు, అమనస్కస్థితి పొందుతావు, అప్పడు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

మనకు సారా తాగే అలవాటు ఉంది అనుకోండి, అది తేలికగానే మానేయవచ్చు అయితే సారా తాగటం మానేద్దాము అనే బుద్ధి మనకు ఉండాలి. సారాతాగటం మానేద్దాము అనే బుద్ధి నాకు కలిగింది అనుకోండి సత్పురుషులు సహాయం చేస్తారు, భగవంతుడు సహాయం చేస్తాడు. ఆ బుద్ధి నీకు ఉంటే అన్ని సహాయాలు అందుతాయి. సారా మానాలి అనే బుద్ధి నాకు లేదు అనుకోండి ఎన్ని సహాయాలు చేసినా వాటి వలన ప్రయోజనం లేదు. వాసన విషయంలో మనం బహుజాగ్రత్తగా ఉండాలి. మనలను పాడుచేసే వాసనలు వంద ఉన్నాయి అనుకోండి. 99 వాసనలు జయించి ఒక్క వాసన మిగిలిఉన్నా అది అనేక జన్మలను తీసుకొనివస్తుంది, దానినిబట్టి ఎంతజాగ్రత్తగా ఉండాలో మీరే చూసుకోండి. మనలను ఏ వాసనలు అయితే బంధిస్తున్నాయో అవి సజ్జనసాంగత్యం వలన పల్చబడిపోతాయి. సజ్జనులతో సహవాసం వలన మనం బాగుపడతాము, దుర్జనులతో సహవాసం వలన చెడిపోతాము.

చదివే పుస్తకాల విషయంలో, చేసే స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనం బాగుపడాలి అనే బుద్ధి లోపలనుండి రావాలి. జ్ఞానం పైనుండి పోసేది కాదు, లోపల నుండి ఊరాలి. బాగుపడాలి అనే బుద్ధి లోపలనుండి వస్తే మనం ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటాడు, ఆబుద్ధి లేనప్పడు ఎన్ని అవకాశములు ఇచ్చినా ప్రయోజనం లేదు.

శాస్త్రంలో ఎన్ని మంచి విషయాలు ఉన్నా అవి గురువు ముఖతహ వినాలి. శాస్త్రాలలో ఉన్న సారాన్నే గురువు మనకు బోధిస్తాడు. ఈ పని నువ్వు చెయ్యి అని శాస్త్రంలో ఎంత నొక్కి చెప్పినా అది గురువు ముఖంలో నుండి వచ్చినప్పడు మీకు దానిని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది, బాగుపడాలనే బుద్ధి కలుగుతుంది. గురువు యొక్క నాలుక హృదయంలో ఉంటుంది, గురువు యొక్క మాట నోటిలో నుండి రాదు, అది హృదయంలో నుండి వస్తుంది. అందుచేత గురువు ఒకమాట చెపుతూ ఉంటే నీకు ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. కొంతమంది గురువులు మాటలతో పని లేకుండానే మౌనంగానే నీ ఆధ్యాత్మికప్రగతికి సహకరిస్తారు. గురువు యొక్క సమక్షంలో మీ జీవితంలో ఎప్పడూ అనుభవించని ప్రశాంతత మీకు అందుతుంది. మీ తల్లితండ్రుల ద్వారాగాని, స్నేహితులద్వారాగాని, బంధువుల ద్వారా గాని పొందలేని శాంతిని, సుఖాన్ని గురువుసమక్షంలో మీరు అనుభవించవచ్చు. భగవంతుడు ఉన్నాడా లేడా అని ఇటువంటి సందేహాలు ఏమైనా ఉంటే గురువు సమక్షంలో ఆ సందేహాలు అన్నీ పోతాయి. గురువు యొక్క దయ మీ హృదయంలో ప్రవేశించినప్పడు అది సైలెంట్‌గానే జరిగిపోతుంది, మీ ప్రక్కన కూర్చొన్న వాడికి కూడా అది తెలియదు. ఈ మధ్య మేము పది మంది ఒకరి ఇంటి దగ్గర కూర్చున్నాము. వాళ్ళ అమ్మాయి బడికి వెళుతోంది. ఆ తల్లి మాకు ఎవరికి తెలియకుండా సైలెంట్‌గా కూతురికి తినమని మిఠాయి పెడుతోంది. అంటే కూతురు మీద ఉన్న ప్రేమ. తల్లి కూతురుకు పెట్టేది ఎంత కూల్‌గా జరిగిపోతుందో గురువు భక్తుడిని అనుగ్రహించేటప్పడు అంతకంటే కూల్‌గా, క్వయిట్‌గా జరుగుతుంది. లోకంలో అన్ని ప్రేమల కంటే తల్లి ప్రేమ గొప్పది కాని ఓ అరుణాచలేశ్వరుడా! నీ ప్రేమతో పోల్చినప్పడు కన్న తల్లి ప్రేమ కూడా ఒక ప్రేమ కాదు. అన్ని ప్రేమలకంటే నీ ప్రేమ ఉదాత్తమైనది. ఈశ్వరుడి ప్రేమ ట్యూబ్‌లైట్ అయితే తల్లి ప్రేమ కిరసనాయిల్ దీపం వంటిది. నీ ప్రేమముందు తల్లి ప్రేమ వెలవెలబోతుంది. తల్లి ప్రేమలో కోరికలు ఉండవచ్చు, ప్రకృతి వాసనలు ఉండవచ్చు, అక్కడ వ్యాపారం ఉంటుంది కాని ఈశ్వరుడి యొక్క ప్రేమలో కళంకం లేదు, అక్కడ వ్యాపారం ఏమీ కనబడదు. చేసైనా ఉండాలి, పెట్టైనా ఉండాలి అని సామెత ఉంది. పూర్వజన్మలో సత్కర్మ చేసి ఉండాలి, లేకపోతే పది మందికి అన్నం పెట్టి ఉండాలి. అలాచేసి ఉంటేనే ఈ జన్మలో సత్పురుషులతో సహవాసం

చేయాలనే బుద్ధి కలుగుతుంది. లేకపోతే మిమ్మల్ని మొట్టినా అసలు ఆ బుద్ధి రానేరాదు. బంతి జారటం మొదలు పెట్టాక అది ఎంత దూరం వెళ్ళిపడుతుందో చెప్పలేము. అలాగ మన బుద్ధి పాడయిపోయిన తరువాత మనం ఎంతవరకు చెడిపోతామో చెప్పలేము, అది అనేక నీచజన్మలకు కారణం అవుతుంది. వాల్మీకి డబ్బు కోసం చాలా మందిని చంపాడు. కాని ఒక మహర్షితో సహవాసం వలన ఆ కిరాతకుడు ఋషి అయి కూర్చున్నాడు. వాల్మీకి చెపుతాడు ఎంతకాలం అయితే ఆకాశం ఉంటుందో, ఎంతకాలం అయితే భూమి ఉంటుందో, ఎంతకాలం అయితే నదులు ప్రవహిస్తూ ఉంటాయో అంతకాలం నా కావ్యం అయిన రామాయణం బతికి ఉంటుంది అని చెప్పాడు, ఎంత ఆత్మవిశ్వాసమో చూడండి.

దేహానికి అతీతంగా, మనస్సుకు అతీతంగా, ఇంద్రియాలకు అతీతంగా, విషయబుద్ధికి అతీతంగా నీ హృదయంలో ఒక సత్యం ఉంది. దానికి చావులేదు, పుట్టుక లేదు, అది స్వతంత్ర్యమైనది. హృదయంలో ఏదో ఉందని ముందు నీకు తెలియాలి కదా, అప్పుడు దానిని పొందాలనే బుద్ధి కలుగుతుంది. నీ హృదయంలో ఒక నిజం ఉందని నీకు స్ఫురింపజేసే వాడు, దానిని పొందాలనే బుద్ధిని నీకు ప్రసాదించేవాడు గురువు. బాహ్యంగా వెయ్యి ఏనుగులను జయించిన వాడికంటే మనోనిగ్రహం సాధించినవాడు గొప్పవాడు. మాట విషయంలోగాని, చేత విషయంలోగాని తనని తాను ఎవడైతే అదుపులో పెట్టుకొంటున్నాడో వాడికి ఆత్మజ్ఞానం పొందటానికి అర్హత కలుగుతుంది. మీకు శాంతి లేదు అనుకోండి, సుఖం లేదు అనుకోండి, వెయ్యి కోట్లు డబ్బు ఉంది అనుకోండి, అప్పుడు ఏమనుకొంటారు అంటే మనకు శాంతిలేదు. రాత్రిళ్ళు నిద్ర పట్టటం లేదు ఈ డబ్బు ఏమి చేసుకొంటాము అని మీకు అనిపిస్తుంది. శాంతి యొక్క వైభవం అట్టిది. వినటం స్మరించుకోవటం, వినటం స్మరించుకోవటం, వినటం స్మరించుకోవటం దీనిని మనోయోగం అంటారు. చెవులతో వింటారు, ఎవరు వింటారు? మనస్సే వింటుంది. మరల స్మరించటం ఎవరు స్మరిస్తారు, మనస్సే స్మరిస్తుంది. ఈ మనోయోగం ద్వారా కూడా మీరు జ్ఞానం పొందవచ్చు. ఎవరైనా ఒక విషయం గురించి చెపుతున్నారు అనుకో. అది శాస్త్రానికి అనుకూలంగా ఉంటే దానిని స్వీకరించు, ఆ మాటలు శాస్త్రానికి విరుద్ధంగా ఉంటే వాటిని వదిలెయ్యి. పేచీలు పెట్టుకోవద్దు. మీరు అది చెయ్యండి, ఇది చెయ్యండి నాలుగురోజులలో మోక్షం వచ్చేస్తుంది అని చెప్పే పిచ్చోళ్ళు చాలా మంది ఉన్నారు. వాసనాక్షయం అవ్వకుండా నీకు మోక్షం ఎలా వస్తుంది. రాగద్వేషముల నుండి విడుదలపొందకుండా, బంధంలో నుండి విడుదలపొందకుండా నీకు మోక్షం ఏమిటి? గురువు అంటే కేవలం ఆ శరీరం అనుకోవద్దు. గురువు అంటే ఆత్మ. మన హృదయంలో అంతర్యామిగా ఏదయితే ఉందో వాడే గురువు. అందుచేత శరీరం మరణించిన గురువుతో సంబంధం

తెగదు. గురువు మాట్లాడుతూ ఉంటే అక్కడ మాట్లాడేది ఆత్మ. అవి లోపల రాగద్వేషాలు పెట్టుకొని మాట్లాడే మాటలు కాదు, రాగద్వేషములతో మాటలు చెప్పిన అవి నిలబడవు, కాల ప్రవాహంలో కొట్టుకొని పోతాయి. మనస్సుకు మూలం హృదయం. మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే అన్ని యోగాల ఫలితం వస్తుంది. ఇప్పడు మన మెదడులో మనస్సు ఎంత సహజంగా ఉంటుందో, అంత సహజంగా మనస్సు హృదయంలో ఉండ గలిగితే మనోనాశనం అవుతుంది. మనస్సు నశిస్తే మనస్సులో ఉన్న వాసనలు అన్నీ కాలి బూడిద అవుతాయి. అయితే మనస్సు హృదయంలో నిలబడటానికి గురువు అనుగ్రహం అవసరం. మనస్సుతోటి, దేహంతోటి తాదాత్మ్యం తగ్గించుకోవాలి. హృదయంలో ఉన్న నిజాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి దేహాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఇప్పడు మనం కారులో భీమవరం వెళ్ళాలి అనుకోండి కారు భీమవరం కాదు, భీమవరం వెళ్ళటానికి కారు సహకరిస్తుంది. అలాగే నీ దేహం ఆత్మకాదు, ఆత్మానుభవం పొందటానికి నీ దేహం సహకరిస్తుంది కాబట్టి దానిని జాగ్రత్తగా చూసుకోవాలి. నువ్వుంటే అశాంతి, నువ్వుంటే దుఃఖం కాని నువ్వు లేకపోతే అశాంతి ఏమిటి? దుఃఖం ఏమిటి? అంటున్నారు భగవాన్. నువ్వు ఉన్నావు అనుకోవటం వలన అశాంతి వస్తోంది, నువ్వు లేవు అన్న సంగతి నీకు అనుభవంలోనికి వస్తే అశాంతి లేదు.

ఎవరైనా పొగిడితే మనకు సంతోషం వస్తుంది, ఎవరైనా విమర్శిస్తే మనకు దుఃఖం వస్తుంది ఎందుకు వస్తోంది అని గౌడపాదుడు అంటున్నాడు. ఈ పొగడ్తలు నిజంకాదు, విమర్శలు నిజంకాదు కాని ఇవి నిజం వలె మనకు కనిపిస్తున్నాయి కాబట్టి దుఃఖం వస్తోంది, అక్కడ నుండి అశాంతి ప్రారంభమవుతోంది, నరకం ఎక్కడో చూడనక్కరలేదు ఈ ఆకివీడు లోనే నువ్వు నరకాన్ని చూస్తున్నావు. నిజంకానిది నిజంవలె నీకు కనిపిస్తున్నంతకాలం నిన్ను దుఃఖ విడిచిపెట్టదు, అశాంతి విడిచిపెట్టదు. ఈ సృష్టి అంతా బ్రహ్మమే కాని బ్రహ్మం బ్రహ్మంలాగ నీకు కనబడటం లేదు, ప్రపంచంగా కనిపిస్తోంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు గోచరించటం లేదు, భిన్నంగా కనిపిస్తోంది, అక్కడ నుండి భయం ప్రారంభమవుతుంది. భిన్నదృష్టి ఉన్నప్పడు, భేదదృష్టి ఉన్నప్పడు పునర్జన్మలు వస్తాయి. ద్వైతంలో నుండి కోరిక పుడుతుంది, ద్వేషం పుడుతుంది, భయం పుడుతుంది. ఈ ద్వైతంలో నుండి విడుదల పొందితేకాని అద్వైతానుభవం కలుగదు.

మిమ్మల్ని ఏదైనా ఒక విషయంలో నేను నష్టపరిచాను అనుకోండి ఏదో జన్మలో మరల నేను మీచేత నష్టపడతాను. అది దేవుని చట్టం. చేసినప్పడు తెలియదు, అనుభవించినప్పడు తెలుస్తుంది అని ఒక సామెత ఉంది. మనం ఎవరినైనా ద్వేషిస్తున్నాము అనుకోండి అందులో ఉన్న బాధ మనకు తెలియదు. ఇతరులచేత మనం ద్వేషింపబడు తున్నప్పడు అందులో ఎంత

బాధ ఉందో అప్పుడు మనకు తెలుస్తుంది. ఇతరులకు మనం ఉపకారం చేస్తే అదే మనకు తిరిగివస్తుంది, ఇతరులకు అపకారం చేస్తే అదే మనకు తిరిగి వస్తుంది. మనం ఏది చేస్తే అదే మనకు తిరిగి వస్తుంది. మీరు మంచిపని చేసి కృష్ణార్పణం అంటే వెయ్యి రెట్లు వస్తుంది. ఒకవేళ మీరు ఏదైనా చెడ్డ చేసి ఆ చెడ్డను వదిలించుకోవటానికి కృష్ణార్పణం అంటే అదే వెయ్యి రెట్లు వచ్చి మీ మీద పడుతుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండండి. కృష్ణుడు భోజనం చేసి వచ్చి కూర్చొన్నాడు అనుకోండి అక్కడ ఉన్న పెద్దలు ఎవరైనా యివాళ భోజనం చేయనివారు ఎవరైనా ఉన్నారేమో చేతులు ఎత్తండి అంటే నిజంగా ఆహారం తీసుకోనివారు మౌనంగా ఉండేవారు, అప్పడే భోజనం చేసి వచ్చిన కృష్ణుడు చెయ్యి ఎత్తేవాడు. అంటే నేను తిన్నాను అనే భావన లేకుండా తింటే తినని వాడితో సమానము. మనం ఏదైనా పనిచేస్తే నేను చేసాను, నేను చేసాను అంటాము. నేను అనే తలంపు లేకుండా, నేను అనే భావన లేకుండా ఒక పని చేసినా వాడు చెయ్యనివాడితో సమానము.

గురువు యొక్క మౌనం శక్తివంతమైనది, అది మీ బుద్ధికి అందదు, అది అనుభవైకవేద్యం, అది మీ మనస్సును పవిత్రం చేస్తుంది. మన శరీరానికి రోగం వస్తే ఆసుపత్రికి వెళతాము. మన మనస్సును బాగుచేసుకోవటానికే ఈ సమావేశాలు, మన మనస్సును శుద్ధి చేసుకోవటానికే ఈ జ్ఞానయజ్ఞాలు. ఈ మాటలు శ్రద్ధగా వినటం వలన, వాటిని మననం చేసుకోవటం వలన మీ మనస్సు బాగుపడుతుంది. మీకు ఇహం, పరం కూడా కలిసివస్తాయి. మల్లెపూల చెట్టు దగ్గర కూర్చున్నారు అనుకోండి, మనకు ఇష్టం లేకపోయినా ఆ వాసన వస్తూ ఉంటుంది. మీరు మహర్షులు, మహాత్ముల దగ్గర కూర్చొన్నారు అనుకోండి, వారు మీతో మాట్లాడకపోయినా, మీ వంక చూడకపోయినా మీరు ఎంతోకొంత పవిత్రులు అవుతారు, ముముక్షత్వం కలుగుతుంది, అక్కడ మాటలతో పని లేదు దర్శనమే చాలు, ఆ వైభవం అట్టిది. మీరు పెద్ద పెద్ద సాధనలు చేయకపోయినా, మీరు చేయగలిగినది చేస్తున్నప్పటికీ మహనీయుల సమక్షంలో వాసనలు అణుగుతాయి, మనస్సు నిర్మలమవుతుంది, సమాధి స్థితిని మీకు ప్రసాదిస్తారు, ఇది అంతా సత్పురుషుల యొక్క భిక్ష. మీకు డబ్బు ఉంది అనుకోండి మీ అమ్మాయికి ఏమీలేదు అనుకోండి మా అమ్మాయి కూడా బాగుపడితే బాగుండును అని మీరు అనుకొంటారు. లౌకికప్రేమలోనే అలా అనుకొంటే ఇంక అలౌకిక ప్రేమ, అభౌతికప్రేమ ఎలా ఉంటుంది, అది మహాప్రవాహం. బుల్లి బుల్లి మనస్సులకే ఇలా అనిపిస్తూ ఉంటే ఇంక జ్ఞాని యొక్క హృదయం ఎలా స్పందిస్తుందో చూడండి. వారి సమక్షంలో నీ మనస్సు బాగుపడటమేకాదు, వారు ఏ స్థితిని పొందారో ఆ స్థితిని మీకు ప్రసాదిస్తాడు. వాడే జ్ఞాని, వాడే గురువు. ఇది మనోగతమైనది కాదు, దేహగతమైనది కాదు, ఈ సంబంధం హృదయగతమైనది. గురువు ఎన్ని జాగ్రత్తలు తీసుకొంటాడో చూడండి. ఒకవేళ మీరు తప్పడు మార్గంలో వెళుతున్నారు అనుకో, మిమ్మల్ని

సవరిస్తాడు. మీరు భీమవరం వెళ్ళాలి అనుకొన్నారు అనుకోండి, కైకలూరు రోడ్డులో వెళ్ళి పోతున్నారు అనుకో, పోతేపోతున్నారు అనుకోడు, మీ దారికి అడ్డువస్తాడు. మరల ఆకివీడు తీసుకొని వస్తాడు, అక్కడ వదిలేయడు, భీమవరం రోడ్డు చూపించి మీ చేత నాలుగు అడుగులు వేయించి ప్రక్కకు తప్పకొంటాడు, వాడు గురువు. మీరు రాంగ్‌తింకింగ్‌లో ఉంటే అడ్డుపడతాడు, మనకెందుకు అని ఊరుకోడు. ఎందుచేతనంటే మీరు మార్గం తప్పిపోతారు. ఎవరి పిచ్చిలో వారు ఉండటం, ఇదే జ్ఞానం అనుకోవటం, అది జ్ఞానం కాదు పిచ్చి అని వాడికి తెలియటం లేదు. పైగా నేను ఏదో కనిపెట్టాను అంటాడు, పిచ్చోడు కనిపెట్టటం ఏమిటి? కృష్ణుడు అంతటి వాడు నేను ఏమీ కనిపెట్టి చెప్పటంలేదు, కొత్తగా చెప్పటంలేదు, వేదాలలో ఉన్న సారం చెపుతున్నాను అని చెపితే వీడు కనిపెట్టాను అంటాడు ఏమిటి? అది వాడి అహంకారానికి గుర్తు. రామకృష్ణుడు శరీరం విడిచి పెట్టిన తరువాత ఒకసారి వివేకానందుడు మహిమల గొడవలలో పడతాడు. అప్పుడు రామకృష్ణుడు స్వప్న దర్శనం ఇచ్చి ఇదా నీ దగ్గర నుండి నేను ఆశించినది. నీవు కష్టపడి కష్టపడి నీటిమీద నడవటం నేర్చుకొంటావు అనుకో, కష్టపడి అది నేర్చుకోవటం ఎందుకు? పది పైసలు ఇస్తే బల్లకట్టువాడు దాటిస్తాడు. కష్టపడి సాధన చేసేది నీటిమీద నడవటానికా? జ్ఞానం సంపాదించటానికా? అంటే శరీరం విడిచిపెట్టాక కూడా గైడెన్స్ విడిచిపెట్టటం లేదు. తను ఏస్థాయిని పొందాడో ఆస్థాయికి చేరుకొనేవరకు గురువు విడిచి పెట్టడు. ఈ లోపుగా ఆకర్షణలకు గురి అయినా, దారి తప్పినా రక్షించే భారం కూడా ఆయన నెత్తిమీద వేసుకొంటాడు, వాడు గురువు. మీకు తెలివి ఉండవచ్చు, డబ్బు ఉండవచ్చు, గౌరవాలు ఉండవచ్చు, వాటిని మీరు పాడుచేసుకోనక్కరలేదు. ఇవన్నీ ఉన్నప్పటికీ గురువు యొక్క అనుగ్రహం అవసరం, సత్పురుషులకు సేవచేయటం అవసరం. ఎండిపోయిన ఆకులు ఎటు గాలివీస్తే అటుపోతాయి, అలా మీ మనస్సు చలిస్తోంది అనుకోండి, మీ మనస్సును ఆ స్థితిలో ఉంచకుండా ఎదురుగాలికి కూడా నిలబడే శక్తిని ఇచ్చి, ఎదురు ప్రవాహానికి కూడా ఈదే శక్తిని ఇచ్చి, మనస్సును పవిత్రం చేసి, ఆత్మజ్ఞానం పొందటానికి తగిన అర్హతను కలుగజేస్తాడు, వాడు గురువు. అది మీకు తెలిసినా, తెలియకపోయినా, ఆ విషయం మీ బుద్ధికి అందినా అందకపోయినా ఇది అంతా గురువు అనుగ్రహం వలననే జరుగుతుంది. మీ రియాక్షన్‌తో సంబంధం లేకుండా ఆయన చేసే పని ఆయన చేసుకొంటూ పోతాడు, వాడే గురువు, వాడే సత్పురుషుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-09-06, గోడిపాలెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహాభిమానం లేకుండా, స్వార్థబుద్ధి లేకుండా మనం ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము అని భగవంతుడు చెప్పాడు. మనం ఏ పని చేసినా యజ్ఞభావనతో చేయాలి. మన శరీరానికి ఏదైనా రోగం వస్తే ఆ రోగం తగ్గించుకోవటానికి హాస్పటల్‌కు వెళతాము.